క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు తూప్రాన్ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తూప్రాన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 కరాటే బాలుర విభాగంలో తూప్రాన్ గీతా స్కూల్ తొమ్మిదవ తరగతి విద్యార్థి అఖిల్ కుమార్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రేమ్‌రాజ్ శుక్రవారం పేర్కొన్నారు. జిల్లాలోని సదాశివపేటలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. నవంబర్ మొదటి వారంలో పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామాంజనేయులు, చైర్ పర్సన్ ఉష, డైరెక్టర్ నారాయణ గుప్త, ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మాట్లాడుతున్న సీఐ వెంకటరాజాగౌడ్

నిజాంపేట(మెదక్): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని రామాయంపేట సీఐ వెంకట్ రాజాగౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని నస్కల్‌లో ఆరోగ్యమే మహాభాగ్యం కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. క్రీడలతో మానసికంగా శారీకంగా ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ యాదగిరి, ఎస్ఐ రాజేష్, కమిటీ సభ్యులు తిరుపతి, స్వామి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఆకుకూరల్లో పోషకాలు పుష్కలం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు ఆకుకూరలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోష, హెచ్ఎం బాలచంద్రం సూచించారు. పోషణమాసం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. స్థానికంగా లభించే ఆకుకూరల్లో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయన్నారు. పొలాల్లో సేంద్రియ సాగు చేపట్టాలని తల్లిదండ్రులను కోరాలని విద్యార్థులకు సూచించారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న నాగేందర్‌రావు కులకర్ణి

రేగోడ్(మెదక్): మండల కేంద్రానికి చెందిన చాకలి సిద్ధమ్మ (65) అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియల కోసం స్థానిక పీఏసీఎస్ డైరెక్టర్ నాగేందర్‌రావు కులకర్ణి తన వంతుగా మృతురాలి కుమారుడు సంజీవులుకు ఆర్థిక సాయం అందజేశాడు. పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు.

ఎస్జీటీ పోస్టులను తగ్గించొద్దు

తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు



మాట్లాడుతున్న తపస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులను తగ్గించరాదని తపస్ ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లం చల్లా, లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో పీజీ హెచ్ఎంతో పాటు పీఈటీ పోస్టులను పెంచుతామని ప్రభుత్వం చెబుతూ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను తగ్గిస్తుందని ఆరోపించారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడు ఉండాలని నిర్ణయించినా ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సమావేశంలో తపస్ సంఘం నాయకులు సిద్దూ, శ్రీధర్‌రెడ్డి, సంతోష్, తిరుపతి తదితరులు ఉన్నారు.

అడుగుకో గుంత.. వెళ్లేదెలా!

మరమ్మతులకు నోచుకోని బీటీ రోడ్లు

- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుంతలమయంగా కొండాపూర్ రోడ్డు



మట్టి తేలిన ముప్పిరెడ్డిపల్లి రోడ్డు



దండుపల్లి-వర్గల్ రోడ్డు

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామీణ రహదారులు అధ్వాన్నంగా మారాయి. గ్రామాలను కలుపుతూ వేసిన బీటీ రోడ్లు దెబ్బతిన్నాయి. అడుగుకో గుంత ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి గుంతలు ఏర్పడిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కనీసం మరమ్మతులకు కూడ నోచుకోవడం లేదు. ఎక్కడ చూసిన గుంతలు, కంకర తేలి రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో ప్రయాణికులకు, వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామీణ రోడ్లకు మహర్దశ ఉంటుందన్న ప్రభుత్వాలు.. కనీసం కన్నెత్తి కూడ చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరతున్నారు.

దెబ్బతిన్న రోడ్లు ఇవే..

- ముప్పిరెడ్డిపల్లి–కాళ్లకల్ రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.
- పరిశ్రమల వాడలైన కూచారం, కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి, కొండాపూర్ అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయి. ఈ రోడ్లపై కార్మికులు ప్రయాణం చేయాలంటే జంకుతున్నారు. రాత్రి సమయాల్లో ఇంటికి రావాలంటే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.
- వెంకటాపూర్ అగ్రహారం–ధర్మరాజ్‌పల్లి–కోనాయపల్లి రోడ్డు గుంతలమయంగా మారింది.
- దండుపల్లి–వర్గల్ రోడ్డు పెద్ద గుంతలుగా మారడంతో పాటు రోడ్డు కుంగిపోయింది.
- జీడిపల్లి– మనోహరాబాద్ రైల్వే స్టేషన్ రోడ్డు, పాలాట–పోతారం వెళ్లే రోడ్డు దెబ్బతిన్నాయి.

పట్టించుకోవడం లేదు

గ్రామాల్లో రోడ్లను పట్టించుకునే నాథులు కరువయ్యారు. కనీసం మరమ్మతులు చేయడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఉంటే.. మిగతా మండలాల్లో చెప్పాల్సిన అవసరం లేదు.

– లక్ష్మణ్‌యాదవ్, ముప్పిరెడ్డిపల్లి

అధికారులు దృష్టి సారించాలి



నిత్యం కార్మికులు పని చేసే పరిశ్రమల వాడలో ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి. గత కొంతకాలంగా రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయాల్లో ప్రయాణించాలటే జంకుతున్నాం. అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలి.

– అలీ, కార్మికుడు

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు

సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు



సీజ్ చేసిన బియ్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు, పోలీసులు

వెల్దుర్తి(తూప్రాన్): పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు పేర్కొన్నారు. మండల కేంద్రం వెల్దుర్తిలోని శ్రీ గణేష్ ట్రేడింగ్ కంపెనీలో మెదక్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం ఎస్ఐ రాజుతో కలిసి పరిశీలించారు. వాహనంలో పట్టుబడిన బియ్యంతో పాటు రైస్‌మిల్లులో సీజ్ చేసిన బియ్యం బస్తాల నుంచి శాంపిల్స్ సేకరించి రేషన్‌బియ్యంగా నిర్ధారించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ..అక్రమంగా డంప్ చేసిన 35 క్వింటాళ్ల 42 కిలోల రేషన్ బియ్యాన్ని వెల్దుర్తిలోని శివసాయి రైస్‌మిల్‌లో భద్రపరిచినట్లు తెలిపారు. ఎక్కడైనా రేషన్ బియ్యం పక్కదారి పట్టినట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు కంపెనీ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. విచారణలో సివిల్ సప్లై జూనియర్ అధికారులు నాగరాజు, గణేష్ ఉన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



అవగాహన కల్పిస్తున్న విజన్ ఎన్జీఓ సభ్యులు

హవేళిఘణాపూర్(మెదక్): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని విజన్ ఎన్జీఓ కమ్యూనిటీ సోషల్ మొబైలైజర్ నవనీత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మద్దుల్‌వాయిలో బాల్య వివాహాలు, బాల కార్మిక నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పిల్లలను చదివిస్తే సమాజంపై అవగాహన పెరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తును తీర్చిదద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ హేమంత్, అంగన్‌వాడీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధితుడికి వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందజేస్తున్న సానీక్ష ఫౌండేషన్ చైర్మన్ శివ, సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందాపూర్‌కి చెందిన సాయిప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో నడవలేని పరిస్థితిలో ఉన్న ఆయనకు సానీక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీల్ చైర్‌ను అందించారు. ఈ మేరకు ఎస్ఎఫ్‌డబ్ల్యూ ఎన్‌జీఓ వెంకటమురళి, రోటరీ క్లబ్ కాచిగూడ సహకారంతో బాధితుడికి వీల్‌చైర్‌ను అందించినట్లు సానీక్ష ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శివ తెలిపారు. అయితే వారం రోజుల క్రితం వాటర్‌బెడ్ అందించామని, ఆయన కోరిక మేరకు వీల్‌చైర్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. బాధితుడిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి వైద్య విద్యార్థులు రాందాస్, కృష్ణ, ఫౌండేషన్ సభ్యుడు రామకృష్ణ ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్



డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

పాపన్నపేట(మెదక్): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి పాపన్నపేటలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా చర్యలు పాటించాలని కోరారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్ఐ దేవీదాస్, కానిస్టేబుళ్లు, వెంకటేశ్, శివకుమార్ ఉన్నారు.

కెమికల్ వ్యర్థాలతో ఇబ్బందులు

శివ్వంపేట(నర్సాపూర్): కెమికల్ పరిశ్రమ ద్వారా బయటకు వస్తున్న వ్యర్థాలను అరికట్టాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో పలువురు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని నవాబుపేటలోని కెమికల్ పరిశ్రమ వ్యర్థాల తో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన భానుప్రకాష్ ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్‌కు ఫిర్యాదు చేశారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి, మహమ్మద్‌నగర్ తదితర గ్రామాలలో శుక్రవారం సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ దుర్గాగౌడ్ , మాజీ సర్పంచ్ సాయాగౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లను అడ్డుకుంటే బుద్ధి చెబుతాం

బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు గంగారాం



రామాయంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న గంగారాం తదితరులు

రామాయంపేట(మెదక్): బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గంగారాం హెచ్చరించారు. శుక్రవారం సంఘం కార్యకర్తలతో కలిసి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల కోసం కొన్నేళ్లుగా తాము పెద్ద ఎత్తున పోరాటం చేస్తుండగా, కొందరు పథకం ప్రకారం అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీసీలకు చేదోడు వాదోడుగా ఉన్నవారినే తాము ఆదరిస్తామన్నారు. పార్టీలకు అతీతంగా పోరాటాన్ని ముందుకు తీసుకుపోతామని గంగారాం పేర్కొన్నారు. ఇకనైనా బీసీ, అనుబంధ సంఘాలు ఏకతాటిపైకి రావాలని ఆయన పిలుపు నిచ్చారు.

త్వరలోనే గోదావరి జలాలు

వాటర్‌గ్రిడ్ ఈఈ నాగభూషణం



ప్యానల్ బోర్డును పరిశీలిస్తున్న నాగభూషణం

శివ్వంపేట(నర్సాపూర్): త్వరలోనే గోదావరి జలాలు అందిస్తామని వాటర్‌గ్రిడ్ ఈఈ నాగభూషణం తెలిపారు. శివ్వంపేటలో నిర్మించిన గోదావరి సంపు వృథాగా ఉన్న విషయం సాక్షిలో ‘తాగు వినియోగం లేదా!’ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ విషయమై వాటర్‌గ్రిడ్ ఈఈ నాగభూషణం శుక్రవారం శివ్వంపేటలోని గోదావరి సంపును పరిశీలించారు. సంపు, మోటర్ల వినియోగం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోదావరి జాలాల కోసం కోమటిబండ నుంచి శివ్వంపేట వరకు గతంలో వేసిన పైప్‌లైన్ ట్రయల్ రన్ నిర్వహించి నర్సాపూర్ నియోజకవర్గానికి గోదావరి జలాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మెరుగైన బోధన చేయాలి

కాంప్లెక్స్ హెచ్‌ఎం సాయిరెడ్డి



మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం సాయిరెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులకు మెరుగైన బోధనకు కృషి చేయాలని సూరారం కాంప్లెక్స్ హెచ్‌ఎం సాయిరెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలం సూరారం జెడ్పీ పాఠశాలలో కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. మెరుగైన ఫలితాల సాధనకు విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ధరిపల్లి జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రుణ లక్ష్యం పూర్తి చేయాలి

డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

చేగుంట(తూప్రాన్): మహిళా సంఘాలకు రూ. 40 కోట్ల రుణాలు అందించే లక్ష్యాన్ని పూర్తి చేయాలని డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మహిళా సంఘాలకు రూ. 40 కోట్ల మేర రుణాలు అందించాల్సి ఉండగా, రూ. 23 కోట్లు అందించినట్లు తెలిపారు. మిగితా రూ. 17 కోట్ల రుణాలు వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. వీటితో పాటు మహిళా సంఘాలకు సంబంధించి కొన్ని గ్రామాల్లో రుణాల డబ్బులు చెల్లించడం లేదని, వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసే మహిళా సంఘాల గురించి గ్రామ స్థాయి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఐకేపీ ఏపీఎం దుర్గాప్రసాద్, ఆయా గ్రామాల సీసీలు పాల్గొన్నారు.

తెగులు నివారించుకోవాలి

కేవీకే శాస్త్రవేత్త రవికుమార్, ఏడీఏ పుణ్యవతి



వరి పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త రవికుమార్, ఏడీఏ పుణ్యవతి

కొడిపల్లి(నర్సాపూర్): వరి పంటలో తెగులును నివారించుకోవాలని కేవీకే శాస్త్రవేత్త రవికుమార్, ఏడీఏ పుణ్యవతి తెలిపారు. శుక్రవారం మండలంలోని భజిరంపేట, కూకుట్లపల్లి గ్రామాలలో పలువురు రైతుల వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పొలంలో మెడవిరుపు, కాటుక, కంపునల్లి, సుడిదోమ, అగ్గితెగులు గమనించినట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులు వల్ల పంటలకు తెగులు సోకుతున్నాయని చెప్పారు. రైతులు ప్రతిరోజు పంటను పరిశీలించాలని, తెగులు కనిపించగానే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మెడవిరుపు, కాటుక తెగులు నివారణకు ట్రైఫ్లిక్ సాబిన్, టెబ్యూకొనజోల్ ఎకరానికి 120 గ్రాములు, వరినల్లి నివారణకు స్పైరోమెసిఫిన్ 200ఎంఎల్, ప్రొపికోనజోల్ 200ఎంఎల్ ఎకరాకు స్ప్రే చేయాలని తెలిపారు. సుడిదోమ నివారణకు ట్రిఫ్లుమీజోప్రియం 95ఎంఎల్ ఎకరాకు స్ప్రే చేయాలన్నారు. ఆమె వెంట ఏఓ స్వప్న, ఏఈఓ స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

తేమశాతం తక్కువ ఉండేలా చూసుకోవాలి

నాబార్డు డీడీఎం కృష్ణతేజ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డీడీఎం కృష్ణతేజ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ఫైజాబాద్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ధాన్యంలో తేమశాతం తక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అనిత, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు యాసిన్, ఉపాధ్యక్షుడు గోపాల్‌రావు పాల్గొన్నారు.

సంగాయిపేటలో..

కొల్చారం(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మాలని తహసీల్దార్ శ్రీనివాస్ చారి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని సంగాయిపేటలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీఓ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఏఓ శ్వేతాకుమారి, ఆర్ఐ ప్రభాకర్, శ్రీకాంత్ రెడ్డి మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

టేక్మాల్(మెదక్): వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మొగులయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని దనూర, ఎల్లాపూర్ గ్రామాల్లో సీఈఓ వెంకటేశం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి రకం ధాన్యానికి రూ. 2,389, రెండో రకం ధాన్యానికి రూ.2,369లకు కొనుగోలు చేస్తామన్నారు. నాయకులు సత్యనారాయణ, నర్సింహారెడ్డి, దుర్గారెడ్డి, దుర్గయ్య, శ్రీశైలం, యోసోబు, ఏఈఓ ఇంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో..

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల మహిళ సమైక్యా సీసీ యశోద కోరారు. శుక్రవారం మండలంలోని ధరిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఓ సంతోష, సీఏ నర్సింహులు, కార్యదర్శి నాగరాజు, మాజీ సర్పంచ్ సిద్దిరాంరెడ్డి, తిరుపతిరెడ్డి, మహేష్, సరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఫైజాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కృష్ణతేజ



కొల్చారం(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్ చారి



దనూరలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వాలి

పెద్దశంకరంపేట(మెదక్): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అడ్డుగా ఉన్నాయని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి జనార్దన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్ బిల్లును గవర్నర్‌కు పంపిస్తే ఆమోదించడం లేదన్నారు. కోర్టులో కేసులు వేసి బిల్లు ఆమోదించకుండా చేశాయన్నారు. బీసీ బిల్లుపై ప్రతిపక్షాలు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

◆ రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి

కొల్చారం(నర్సాపూర్): పురుగుల మందులు కొనుగోలు చేసే రైతులు రశీదు తీసుకోవాలని ఏఓ శ్వేత కుమారి సూచించారు. శుక్రవారం ఎనగండ్ల గ్రామ పంచాయతీ దుంపలకుంట చౌరస్తాలోని రైతు ఆగ్రోసేవ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. దుకాణంలోని పురుగుల మందులు, ఎరువులను పరిశీలించారు. గడువుతీరిన మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదని హెచ్చరించారు. దుకాణం నిర్వాహకుడు రాజా గౌడ్ ఉన్నారు.

◆ బైక్‌ను ఢీకొట్టిన కారు

వ్యక్తికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నశంకరంపేట మండలం ఎస్.కొండాపూర్‌కు చెందిన మత్తడి సత్యనారాయణ శుక్రవారం మెదక్ వైపు వస్తుండగా రామాయంపేట వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్సులో మెదక్ ఆస్పత్రికి తరలించారు.

◆ పేకాటరాయుళ్ల అరెస్ట్

రామాయంపేట(మెదక్): పట్టణ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నగదుతో పాటు ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. సెవెన్ హిల్స్ స్విమ్మింగ్ పూల్ వద్ద పేకాట ఆడుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులతో పాటు నగదు, మొబైల్స్‌ను స్థానిక పోలీసులకు అప్పగించారు.

◆ ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని దామరంచ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అక్కంపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో హనుమాన్, శివ పంచాయతన సహిత విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వంటి కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.